# స్నేహామృతం

అమృతం అందాలే రాసిపోసిన అజంతా శిల్పం లాగా ఉంటుంది. అంగ సౌష్ఠవం పరిపూర్ణంగా ఏ విభాగానికా విభాగం తీర్చిదిద్దినట్లు, రవి వర్మ చిత్రంలా ఉంటుంది. యౌవనం శరీర ఉద్యానవనంలో ప్రతి కొమ్మా, రెమ్మా, మొగ్గా, పూవులమీద మంచు బిందువులు, సూర్యకిరణాల మెరుపులు సృష్టించింది.

ప్రశాంత జీవితం తనువంతా పండువెన్నెల ప్రవాహంలో అందంగా అలవోకగా కదిలిపోతున్న నావను చేసింది. ఆమె సంసారం నిండుగా ప్రవహించే సేలయేటి చిరు తరగల ఉయ్యాలగా ఉంది. ఆనందానికి చీరెకట్టి, జాకెట్టు తొడిగి, తలదువ్వి, పూలు పెట్టి నుదుటిమీద ఉదయించే చంద్రుణ్ణి కట్టినట్లుంటుంది అమృతం.

ఈ అమృతం కోసమే దేవుళ్ళు లాంటి యువకులు పోటీపడి సొంతం చేసుకోవటానికి తాపత్రయపడ్డారు. సుధాకర్ విజయం సాధించాడు. ఆమె నడుస్తుంటే గాలిల్లో తేలుతున్న మల్లెపూల మాలలా ఉంటుంది.

ఆమె మాట్లాడుతుంటే బాల్యంలో విని పొంగిపోయి పులకించి మర్చిపోయిన పాట అవ్యక్త మధురంగా ఆలపించినట్లుంటుంది. ఆమె చేయి ఊపుతుంటే కారు స్టార్టు చేసిన సుధాకర్‌కి కాళ్ళూచేతులు ఆడకపోవచ్చుకాని, చూసేవాళ్ళకు జాతీయ పతాకం రెపరెపలాడినట్లుంటుంది. ఆమె చీరెచెంగు కప్పుకుంటే నెమలి పురివిప్పి నాట్యమాడబోతున్నట్లు అనిపిస్తుంది. సాయంకాలం భర్తను ఆదరంగా ఆహ్వానిస్తున్న అమృతం రెక్కలువిప్పుకుని ఎగరబోతున్న శాంతి పావురంలాగా ఉంటుంది. వాళ్ళిద్దరూ వాళ్ళ గదిలో చేరి తలుపు వేసుకుంటే ఆ గదిలోంచి సరిగ్గా వినిపించని పాటల ప్రపంచం ప్రసారమవుతుంది.

ఉదయం సుధాకర్ టిఫిన్ తినటానికి ముందు అమృతం వచ్చి పూలు తుంచినట్లు తలలో తురిమినట్లు చేయకపోతే పరిమళ తరంగాలు అతడికి పరిచర్య చేసినట్లు కాదు. కారు తాళాలు చేతికిస్తున్నప్పుడు చిరుగంటల సుస్వరాలు గాలిలో తేలిపోతున్నట్లుంటుంది.

సాయంకాలం నవ్వుతూ భర్తను ఇంట్లోకి ఆహ్వానించే అమృతం, పొద్దుట విచ్చుకోవలసిన మొగ్గ సాయంకాలం దాకా నిరీక్షించి విచ్చుకొన్న సుగంధాల పుష్పంలాగా కనిపిస్తుంది. భర్త దగ్గరకు తీసుకుంటే గువ్వై, పువ్వై, నవ్వై, గజ్జెలు విప్పిన నాట్యమై, కౌగిట్లో ఒదిగిపోతుంది. ఇమిడిపోతుంది, దాగుంటుంది. భర్త తాకితే కరిగిపోతుంది. ఉదయం కురిసిన మంచు

సూర్యకిరణాల స్పర్శతో ఒక్కొక్క బొట్టుగా పూలనుంచి, లేత ఆకుల నుంచి జారిపడినట్లు అయిపోతుంది.

అత్తమామలకు అమృతం అపురూపమైన గాజు బొమ్మ, ఆస్తారుబస్తంగా, అల్లారుముద్దుగా పసిబిడ్డను చూసినట్లు చూసుకొంటున్నారు. భర్తకామె బంగారు కొండ. తరిగిపోకుండా, కరిగిపోకుండా, దొంగలకంటపడి దోపిడీ కాకుండా కాపాడుకొంటున్నాడు.

అమృతం కాలుతీసి కాలుపెడితే ఎక్కడ నొప్పి తగులుతుందోనని అత్త అల్లాడిపోతుంది. అత్తమామలు తల్లిదండ్రుల్ని మించి ప్రేమిస్తున్నారు. తల్లిదండ్రులకు గారాల కూతురు, అత్తమామలకు ముద్దుమురిపాల కోడలు, ఇంట్లో ఆడబిడ్డలు లేరు. బావలూ, మరదులూ లేరు. అత్తమామలకు తాను ఒక్కతే అన్నీ.

వాళ్ళ ప్రేమకు అమృతమే కేంద్రం. వాళ్ల సంతోషాలకు ఆమే కూడలి. ఆస్తి ఉంది. అంతస్తు ఉంది. చిలకా గోరింకల వంటి కొడుకూ కోడలూ ఉన్నారు.

ఆరోగ్యంగా అందాల బొమ్మలాగా, ఆనందాల హద్దులాగా కోడలు ఉంది. అన్నీ బాగున్నాయి.

కోడలికి నెలతప్పలేదు. డాక్టర్లు చూసి పరీక్షించి అంతా బాగుందన్నారు. అత్తా మామలు బయటపడలేదుకాని లోలోపల దిగులుగానే ఉన్నట్లు అమృతం గుర్తించింది. అప్పటి నుంచి ఆమెకూ ఏదో వెలితిగా , దిగులుగా, చెప్పుకోలేని బాధగా ఉందన్నమాట వాస్తవమే.

వెనకింట్లో స్నేహకు ఐదేళ్ళు, స్నేహకు రాని మాటలు, చేయని పనుల్లేవు. పాటల టీ.వీ. ఆటల బొమ్మ, మాటల మూట, ముద్దుమురిపాల వెల్లువ, ప్రవాహం.

స్నేహను చూస్తుంటే తన బాల్యం అమృతానికి గుర్తొస్తుంది. తన తల్లిదండ్రులు తనను చూసుకొన్నట్లే స్నేహ తల్లిదండ్రులు, అవ్వతాతలు పాపను ముద్దుగా, గారాబంగా చూసుకొంటారు. ముద్దంతా మూటగట్టుకుని నెత్తిన పెట్టుకొని ప్రయాణం చేస్తున్న బహుదూరపు యాత్రీకురాలులాగా ఉంటుంది స్నేహ. స్వర్గ సౌందర్యం భూమికి తెచ్చిన దేవతల ప్రతినిధిలాగా వారసత్వ ప్రతిబింబంలాగా ఉంటుంది స్నేహ.

పొట్లాలు లాంటి చేతులతో లంగా కొంగు పట్టుకొని రింగులురింగులు తిరుగుతూ డ్యాన్స్ చేసే స్నేహ ఓ అపురూపమైన అందం. అద్భుతమైన శిల్పం.

పూల పందిళ్ళ చుట్టూ, గులాబి కుదుళ్ళచుట్టూ, పెరడంతా తానే అయినట్లు పాడుతూ, ఆడుతూ తిరిగే స్నేహ గొంతు మధురంగా, ఆట అందంగా, కదలిక కమనీయంగా ఉంటుంది. పెరడంతా తనదైనట్లు. లానంతా పెరటిపూలే అయినట్లు ఎగిరే, దూకే స్నేహ చూడముచ్చటగా ఉంటుంది. చెట్టుచెట్టుకీ పూవుపూవుకు ఆగకుండా పరుగెత్తే స్నేహ రెక్కలల్లారుస్తుంటే సీతాకోకచిలుకలు తిరిగే పూదోటలా ఉంటుంది పెరడు.

ఇంటి వెనుక నిలబడి, వెనకింటి పెరట్లో ఆటను పాటను వెంటేసుకొని ఆడుకొనే అందాల బొమ్మను చూస్తూ ఉండే అమృతానికి ఎంతసేపు చూసినా తనివితీరదు. తనను తాను మరచిపోతుంది. కరిగి తేనెసోనై ప్రవహిస్తుంది. తన శరీరమంతా వెన్నెలై, వెలుగై, చుట్టూ పరుచుకొంటున్నట్లుంటుంది. తానొక మంచు బొమ్మై, తేనెదిమ్మై, స్థాణువై చలనం కోల్పోతుంది.

స్నేహ అవ్వతాతలకు ఆర్డర్లు వేస్తుంది. వాళ్ళు జీ హుజూర్ అని ఆజ్ఞ నెరవేరుస్తారు. కొడుక్కు పుట్టిన అందాలబొమ్మ ఆజ్ఞాపిస్తే శిరసావహించకపోవటానికి వాళ్ళేమైన ఆ విధేయులైన సేవకులా! కారు. విధేయులు!.

స్నేహవాళ్ళ అమ్మానాన్నలు చెట్లకింద కుర్చీలు వేసుకొని కూర్చుంటే, వాళ్ళకు ప్రపంచ చరిత్ర అంతా బోధించి, సౌందర్య శాస్త్రమంతా విశదీకరించి, సర్వకళలూ ప్రదర్శించి, సర్వ సంగీతం వినిపించి, వాళ్ళు నవ్వుతుంటే అందం, అద్భుతం, ఆనందం ప్రపంచంలో మరెక్కడా చూడలేమని అమృతం నమ్ముతుంది.

అమ్మా నాన్నల చేతుల్లోంచి స్నేహ తప్పించుకొని పారిపోవటం చూస్తే లేగదూడల చెంగనాలు గుర్తుకు వస్తాయి. ఎవరికీ దొరకకుండా పాప పరుగులు తీయటం, వాళ్ళు పట్టుకోబోవటం, పాప గునగునా అందకుండా జారిపోవటం, ఆ ఇద్దరిదే అదృష్టం.

ఎవరూ లేనప్పుడు తమ పెరట్లో నుంచి, వాళ్ళ పెరట్లో ఆడుకొంటున్న స్నేహను అమృతం రమ్మని చేతితో సైగచేసి పిలిచింది. అలాగే సైగచేసి ఆమెనే రమ్మని తిరిగి స్నేహ పిలిచింది. 'నీ పేరేమిటం'టే 'నీ పేరేమిటం'ది. 'అమృతం' అంటే 'స్నేహం' అంది. 'ఆడుకొందామా' అంటే 'ఆడుకొందాం' అంది మాటకు మాటగా.

వాళ్ళ కలయికకు, ఆటకు, రాకపోకలకు ఒక అవరోధం ఉంది. రెండిళ్ళమధ్య గోడ! అమృతంకంటే గోడ ఎత్తుంది. స్నేహకంటే గోడ రెట్టింపు ఎత్తుగా ఉంది. ఎవరూ దాటలేరు. ఎవరూ దాటరాదు!

స్నేహ తాతకు, అమృతం మామకు ఎందుకో మాటా మాట వచ్చింది. వాళ్ల ఇళ్ళ మధ్య రాకపోకలనేవే లేవు. తన ఇంటికంటే పక్క ఇల్లు చాలా బాగుందని, రెండో మనిషి కొత్త ఇంటినే మళ్ళీ మార్చి మరింత గొప్పగా కట్టించాడు. అది మొదలు, వాళ్ల కుటుంబాల మధ్య మాటలు లేవు. ఇరుగూ పొరుగు సంబంధాలు లేవు.

స్నేహవాళ్ళ ఇంటికి అమృతం పోలేదు. అమృతంవాళ్ల ఇంటికి పోవాలంటే ఏం చేయాలో స్నేహకు తెలియదు. ఇద్దరూ గోడకటూ ఇటూ నిలబడి 'హలో' అంటే 'హలో' అనుకొంటారు. 'పాపా' అంటే 'పాపా' అని పిలుచుకొంటారు. 'పసితల్లీ!' అంటుంది అమృతం. 'బుజ్జితల్లీ' అని పలుకుతుంది స్నేహ. 'నీకు ముద్దులు కావాలా' అంటే 'నీకు గుద్దులు కావాలా' అంటుంది పసిమొగ్గ.

'నిన్నెత్తుకొంటాను రావే తల్లీ' అంటే 'నిన్నే ఎత్తుకొంటాను రావె బుజ్జీ' అంటుంది స్నేహ, కొత్త సినిమా కబుర్లన్నీ అమృతం చెబితే, ఆ సినిమాలో పాటలన్నీ వచ్చీరానివి పాడి వినిపిస్తుంది స్నేహ.

వాళ్ళిద్దరూ ఒకరినొకరు పిలుచుకోవటం చూసుకోవటం, కబుర్లు చెప్పుకోవటమేకాని చేతులు కలుపుకోలేరు. భుజాలపై ఆప్యాయంగా చేతులు వేసుకోలేరు.

అమృతకు స్నేహను ఎత్తుకోవాలని, ముద్దులు పెట్టాలని, ముద్దులు పెట్టించుకోవాలని ఇష్టంగా ఉంది. కానీ వీలులేదే! స్నేహకూడా ఫ్రెండ్ దగ్గరకెళ్ళాలని, ముద్దులు పెట్టాలని, పూలు తలలో జడలో తురమాలని, ఒళ్ళో కూచుని కబుర్లు చెప్పాలని ఆశగా ఉంది.

'ముద్దు పెడతావా?' అని అమృతం అడిగితే, 'ఓ! తప్పక! మా ఇంటికి రా' అంది స్నేహ. 'రాలే' నంటే 'మరేంచేద్దాం' అని సోక్రటీసు పోజులో, థింకర్ స్టాచ్యూ భంగిమలో ఆలోచించసాగింది స్నేహ.

"నా ఫ్రెండ్ దగ్గరకు పోతానని' స్నేహ తల్లిదండ్రుల్ని అడిగింది. వాళ్ళు కాదనలేదు కానీ అవుననలేదు. రెండిళ్ళ వాళ్ళూ వీళ్ళిద్దరి గోడమైత్రి ఘాటుమైత్రిగా, గాఢమైత్రిగా గుర్తించకపోలేదు. వాళ్లెంతకీ తెమిల్సి చెప్పకపోతే "మీకు ఫ్రెండ్సు లేరా? మీరు వాళ్ళ ఇళ్లకు పోరా?" అని కూడా ప్రశ్నించింది.

ఆ రోజు సాయంకాలం "నేను చిన్నదాన్ని కదా! చిన్నవాళ్ళు పెద్దవాళ్ళ దగ్గరకు పోవాలటకదా. నేను నీ దగ్గరకు ఒకరోజు వస్తానులే! బోలుడు కబుర్లు చెబుతానులే. చాక్లెట్ లిస్తాను. ముద్దులు పెడతాను సరేనా! ఏడవకూ" అని ఓదార్చింది. అమృతం కడుపునిండా నవ్వింది. అంత హాయిగా ఆమె ఈ మధ్య నవ్వి ఎరగదు.

అమృతం నవ్వుతుంటే "అట్లా నవ్వాలి సరేనా" అంటూ స్నేహ విరబూసిన పొదరిల్లులాగా పరిమళం, మైత్రీ పరిమళం పంచింది. ఆగని, ఆపని ప్రవాహంలాంటి, పరుగులాంటి నవ్వుతో.

"హలో ఫ్రెండ్" అంటూ హాల్‌లో అడుగుపెట్టిన స్నేహను చూసి, ఉలిక్కిపడి, ఎదురెళ్ళి, ఎత్తి, గుండెల కొత్తుకొని "థాంక్స్ ఫ్రెండ్" అంది అమృతం.

అత్తామామలు ఆశ్చర్యంగా చూస్తుంటే "ముద్దివ్వరేం-నేను ముద్దు పెడతానుండండి" అంటూ అమృతం దగ్గర నుంచి దిగిపోయి, అవ్వకీ తాతకీ రెండేసి ముద్దులు పెట్టి "చాలా? ఇంకా కావాలా?" అంది.

"చాలు" అని ఇద్దరూ ఒకేసారి చెబితే "చాలంటే చాలదు. ముద్దుకు ముద్దు చెల్లు. పెట్టండి" అంటూ చెరి రెండు ముద్దులు పెట్టించుకొని "నా ఫ్రెండుతో మాట్లాడుకోవాలి" అని అమృతం చెంగుపట్టుకొంది.

ఆమె చెంగున ఒంగి ఎత్తుకొని రెండు బుగ్గలమీద బోలుడు ముద్దులు పెట్టింది. "అబ్బ! ఏమంత తొందర? ఎంతో సమయముంది" అంది.

"నేనన్ని ముద్దులు పెట్టాలా?" అని అడిగింది. "ఎన్ని ముద్దులో లెక్కపెట్టుకోలేదే! కొన్ని పెడతాలే! ఏడవకు" అంటూ ముద్దుల వాన కురిపించింది.

"బంగారు తల్లీ! రోజూ రామ్మా" అని పెద్దవాళ్ళు అంటే "ఆశ దోసె అప్పడం వడా! మీరొచ్చినన్ను తెచ్చుకోండి. ఏం ఫ్రెండ్ ఏమీ మాట్లాడవూ?" అంది స్నేహ.

"అలాగే స్నేహ నేను వచ్చి మీ అమ్మానాన్నలతో చెప్పి మా ఇంటికి తీసుకొస్తాను. సరేనా?" అంది అమృతం.

"మరి నేను వెళ్ళిరానా?" అంది స్నేహ.

"అయ్యో తల్లీ రాకరాక వచ్చావు. కొంచెంసేపు ఉండు తల్లీ" అని అమృతం బతిమాలింది.

"పోనీలే పాపం నీ మాట ఎందుకు కాదనాలి" అంటూ లేచి టీవీ పెట్టింది. పేపర్లు తీసి సర్దింది. సోఫా కవర్లు తీసి వేసింది. పుస్తకాలు తీసి షెల్ఫ్‌లో పెట్టింది.

"అన్నీ తెలిసినదానిలాగా ఆ సర్దటమేమిటే" అంటే "అయ్యోరామా! అదో బ్రహ్మ విద్యా? దానికి అన్నీ తెలియాలా" అంటూ బుగ్గలు నొక్కుకుంది. టిఫిన్ పెడితే వద్దంది. పాలు ఇస్తే తాగకుండా "నేనేమన్నా చిన్నపిల్లనా పాలుతాగటానికి?" అంది. చాక్‌లెట్ ఇస్తే నోట్లో వేసుకొని క్షణంలో నమిలేసింది. నీళ్ళు తాగింది.

"రెండు దాటింది. అన్నాలు తిన్నారా లేదా మీరు?" అని అడిగి "నేను తిన్నాను" అంది అమృతంతో.

"రా" అని ఎత్తుకొంటే "నేనేం చిన్నపిల్లనా నడిచిరాగలను" అని భుజం మీంచి దిగింది.

"ఇది నీ మంచమా?" అని, "బాగుంది" అంది.

"ఇది డ్రెస్సింగు టేబులా?" అని. "పిచ్చిపిల్ల! అన్నీ సరిగ్గా సర్దుకోవాలి" అని సర్దసాగింది. "ఫ్రెండ్ నీకు నిద్ర వస్తుందా?" అని, "పడుకో పిచ్చిపిల్లా!" అంది.

"రా పడుకొందాం" అంటే "నాకెన్ని పనులు! నువ్ పడుకో నేను వస్తాను" అని టీవీ ఆన్ చేసింది.

"నీకే ఛానల్ కావాలి" అని అమృతాన్ని అడిగింది.

"నీకిష్టమైన ఛానలే నాకూ కావాలంది" అమృతం.

"మీ టీ.వీ. మా టీవీ కాదు. నువ్వే తెలుగు పాటలు పెట్టు" అంది స్నేహ. అమృతం ఛానల్ పెట్టింది.

"రోజంతా ఏంచేస్తావ్? ఏమీ చదువుకోవా? ఏమైనా చదువుకో" అంది. బొమ్మల పుస్తకాలు తీసింది.

"ఇది చదువకూడదు" అంది.

"ఎందువల్ల?" అని అడిగితే "మా అమ్మ చదవకూడదని నాన్న చెప్పాడు. వారపత్రికలు కొనుక్కో! మంచి కథలుంటాయి నాకు చెప్పొచ్చు" అంది.

"నువ్వే చదువుకో" అంది అమృతం.

"నేనేమన్నా మీ అంత పెద్దదాన్నా? నేను చదవలేను. మీరు చెబితే వింటాను" స్నేహ మాటలకు, పనులకు, పొంగిపోతున్న అమృతం ఎత్తుకొని గుండెలకు ఒత్తుకొని బుగ్గలు, కళ్ళు, నుదురు, బొజ్జ ముద్దుల వర్షం కురిపించింది. "చెబితే వినరుకదా!" అని దిగి, మంచంమీద కూర్చుని "ఇన్ని ముద్దులు పెట్టటంనా తరమా?" అంటూ రాగాలు గారాంతో సన్నసన్నగా పలికింది.

ఆవులించింది. "నిద్ర వస్తూ ఉందా?" అని అడిగితే 'అవు' నని తల ఊపింది స్నేహ.

**అమృతం** పడుకొని పక్కలో వేసుకొని బుగ్గమీద, బొజ్జమీద చిచ్చుకొడుతుంటే, నేను "పక్కన పడుకోను" అంది. 'మరి?' అంటే, 'బొజ్జ మీద' అంది.

పడుకోబెట్టుకొంటే, నిద్రపోకుండా కళ్ళు తెరిచి, "నీకు నేను ముద్దులు బాకీ ఫ్రెండ్" అంది.

"రేపు తీరుద్దువుగాని, ఇప్పటికి నిద్రపో!" అంది.

"బాకీ తీర్చకుండా నిద్రపోను!" అంటే "అయితే తీర్చు మరి" అంది అమృతం.

బొజ్జమీద పడుకొన్న స్నేహ ముందుకు జరిగి ముద్దులు పెట్టసాగింది. బుగ్గ, కళ్ళు, నుదురు, పెదాలు గడ్డం, చెంపలు, చెవులు ముద్దాడింది స్నేహ.

"బుగ్గలు కొరకనా?"

"తప్పు కొరక్కూడదు"

"పిచ్చిపిల్ల నీకేం తెలియదు. కొరకొచ్చు"

"ఎవరు చెప్పారు తల్లీ"

"ఎవరు చెబితే నీకెందుకు తల్లీ, కోరుతున్నా"

"సరే! నొప్పి లేకుండా"

కొరికి "నొప్పి అయిందా?" అని అడిగింది.

"కాలే'దంది అమృతం.

"అంతే ఏం నొప్పి వుండదు. చూడు" అంటూ చెవి కొరికింది. ముక్కు కొరికింది. భుజాలు, చేతులు, కాళ్ళు, వేళ్ళు బుద్ధిపుట్టిన చోటల్లా కొరికినట్లు చీకింది.

"నొప్పా?"

"లేదు"

"పాలు తాగనా?" అంది స్నేహ.

"తేనా?" అంది అమృతం.

"వద్దు! తాగనా" అంది.

"నువ్వు పాలు మానలేదా?"

"మానాను. కానీ తాగవచ్చు"

"మానినాక తాగరాదు. తల్లి దగ్గరే తాగాలి. నా దగ్గర పాలుండవు" అంది అమృతం.

"ఎందుకుండవు?"

"పిల్లలు పుడితే ఉంటాయి"

"పిల్లలెప్పుడు పుడతారు?"

"దేవుడిస్తే" అంది.

స్నేహకేమీ అర్థం కాలేదు. సుతారంగా అమృతం బుగ్గలు నిమురుతూ, తల సవరిస్తూ నుదురు తుడుస్తూ "అలిసిపోయావా?" అని అడిగింది.

"లేదు" అంది అమృతం. "నువ్వక్కడ చేయి పెట్టకూడదు" అంది వెంటనే.

"ఏంకాదు, పెట్టవచ్చు" అంది స్నేహ.

"నువ్వక్కడతాకరాదు?"

"ఏం ఎందుకు తాకరాదు?"

"అదేంతే" అంది అమృతం.

"అదేం కాదు-తాకవచ్చు. మా నాన్న తాకితే మా అమ్మ వద్దనదే" అంది స్నేహ.

"నువ్వు నన్ను తాకకూడదు. అమ్మల్ని నాన్నలు తాకవచ్చు. భార్యల్ని భర్తలు తాకవచ్చు. యువతుల్ని యువకులు తాకవచ్చు. పసితల్లీ! బంగారు కొండ! పెద్దదాన్ని నన్ను అక్కడ తాకరాదు నువ్వు"

"మరెవరు తాకాలి" అడిగింది స్నేహ.

"మా సుధా"

"ఆమె ఎవరు?"

"మా ఆయన-నా భర్త"

"తాకమను" అంది స్నేహ.

"తాకమంటాను సరేనా ఫ్రెండ్. థాంక్స్" హాల్లో హడావుడిగా వుంటే స్నేహ, అమృతం బెడ్‌రూమ్‌లోంచి వెలుపలికి వచ్చారు. స్నేహ తల్లి, అవ్వ, పాపను వెతుక్కుంటూ వచ్చారు. పాప నిద్రపోయే సమయమని చెప్పారు.

అమృతం, అత్త ఇద్దరూ పాపతోపాటు పాపతల్లీ, అవ్వలతో వెనుక ఇంటికి వెళ్ళి పాపను దించి కుశల ప్రశ్నలు వేసుకొని, కులాసా కబుర్లు చెప్పుకొని వచ్చారు.

క్రమంగా మగవాళ్ళు మాట్లాడుకోవటమే కాదు రాకపోకలు కూడా సాగించారు. భర్తను అమృతం పిచ్చి ప్రేమతో రెచ్చిపోయి చూసుకొంటూ వచ్చింది.

రెండు నెలల్లో అమృతం నెలతప్పింది.